క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ


బాధితున్ని పరామర్శిస్తున్న సునీతారెడ్డి

బంట్వారం: కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మహేందర్‌రెడ్డి డెంగీతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్ రికవరీ


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

పూడూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఎస్‌ఐ గిరి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి తన సెల్‌ఫోన్ పోయిందని గత నెల 15న చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ ఆచూకి తెలుసుకొని, మంగళవారం బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థికసాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామానికి చెందిన గరక అంజిలమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్, ఆ పార్టీ జిల్లా నాయకుడు బాలముకుందం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కురువ సంఘం రెడ్డిపల్లి రాములు, నాయకులు రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి సహాయం

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రావిరాల ఎల్లమ్మ అనే ఒంటరి వృద్ధురాలి దీన స్థితి తెలుసుకున్న సర్పంచ్ విజయలక్ష్మి మంగళవారం 25 కేజీల బియ్యం, వంట సామగ్రి, సరకులు అందజేశారు. వర్షానికి కూలిన వృద్ధురాలి ఇంటిని మరమ్మతు చేయించారు. ఇక మీదట ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రియాజుద్దీన్, మత్స్యసహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందెయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మర్పల్లి: మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అరుణ్ కుమార్ గౌడ్ సూచించారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, చెట్ల కింద నిలబడ వద్దని చెప్పారు. ఉధృతంగా ప్రవహించే వాగులను దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసర సేవల కోసం డయల్ 100, 8712670038, 8712583384 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

నిర్ణయం మీ చేతుల్లోనే..


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

- 3 గంటల విద్యుత్ కావాలంటే కాంగ్రెస్‌కు పట్టంకట్టండి
- 24 గంటలు కావాలంటే బీఆర్‌ఎస్‌ను ఆదరించండి
- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం మోమిన్‌పేట మండలం కేసారం క్లస్టర్ రైతు వేదికలో రైతులతో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సాగుకు రోజుకు మూడు గంటల కరెంటు సరిపోతుందనడం అవగాహన రాహిత్యమన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలవని పరిస్థితిలో రాత్రింబవళ్లు బావుల వద్ద రైతులు కాపలా కాసేవారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు ఓర్వలేక పోతున్నారని, ఆ పార్టీ మళ్లీ పట్టం కడితే గతం పునరావృతం అవుతుందన్నారు. అందుకే ఆగం కాకుండా తెలంగాణ సమాజం కాంగ్రెస్‌ను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు గంటల విద్యుత్ కావాలంటే కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని, 24గంటల కరెంట్ అవసరమైతే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని, నిర్ణయం మీ చేతుల్లోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచులు చంద్రకళ, కాశీరాం, సత్యనారాయణ రెడ్డి, అంతమ్మ, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రైతు బంధు మండల కోఆర్డినేటరు అజీజ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు నర్సింహులు, మల్లయ్య, రాజు, మైపాల్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఆ పార్టీతోనే కర్షకులకు కష్టాలు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ హయాంలోనే కర్షకులు కరెంట్ కోసం ఎన్ని కష్టాలు పడ్డారో అందరికీ తెలుసునని, ఆ పార్టీ అంటేనే విద్యుత్ వెతలు గుర్తుకు వస్తాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి మాటలకు నిరసనగా మంగళవారం పరిగి మండలం రంగాపూర్ రైతు వేదిక ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు నిరంతరం ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, తెలంగాణ రైతులంతా బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారని తెలిపారు. ఇది చూసి ఓర్వలేని కాంగ్రెస్ నేతలు.. కరెంట్ కోతలు విధించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవన్నారు. ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.


పరిగి: నిరసనలో ఎమ్మెల్యే తదితరులు

కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం

- హస్తం హయాంలో రాజులా బతికిన రైతులు
- డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ


రైతు వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తుందని, కాంగ్రెస్ హయాంలోనే రైతు రాజుగా బతికాడని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. మంగళవారం పరిగి మండలం నస్కల్‌లో రైతువేదిక వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తానని చెప్పి 9సంవత్సరాలు అయినా ఇంత వరకు చేయలేదన్నారు. వ్యవసాయ పనిముట్లపై రాయితీ ఇవ్వకుండా రైతులపై రాష్ట్ర ప్రభుత్వ భారం మోపుతుందని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలోనే 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా వ్యవసాయానికి సరఫరా చేశామని, సాగు పరికరాలపై సబ్సిడీ ఇచ్చామని తెలిపారు. రైతులు కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గుచూపుతున్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా.. విచారణా?

రూ.లక్ష సాయం లబ్ధిదారుల ఎంపికపై ప్రజాప్రతినిధులు గరం

మోమిన్‌పేట: కుల వృత్తుల రూ.లక్ష సాయంపై ప్రజాప్రతినిధులు అధికారులపై గరంగరంగా ఉన్నారు. మాకు సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో ఎలా విచారణ చేపట్టారని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సాయం కొరకు మండల పరిధి 25గ్రామ పంచాయతీల నుంచి 600మంది బీసీ కుల వృత్తుల వారు దరఖాస్తు చేసుకోగా.. కార్యదర్శులు, వెలుగు సిబ్బంది సీసీలతో అధికారులు విచారణ చేయించారు. అందులో అనర్హులుగా 346మందిని పేర్కొంటూ.. అర్హులుగా 254మందిని ఎంపిక చేశారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తచేసినట్లు సమాచారం. అర్హులను కూడా అనర్హులుగా ఎలా గుర్తించారని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. తమకు సమాచారం లేకుండా ఎలా విచారణ చేస్తారని, ప్రజాప్రతినిధులుగా తాము ఉన్నా ఒకటే.. లేకున్నా ఒకటేనని వాపోతున్నారు. సమాచారం ఇవ్వకుండా అర్హుల జాబితాను ఎలా తయారు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు చేసిన పనికి తాము గ్రామాల్లో ఏం ముఖం పెట్టుకొని తిరగాలని వాపోతున్నారు. ప్రజాప్రతినిధుల అలక నేపథ్యంలో పలువురు అధికారులు మాట్లాడుతూ ఒక సారి రిజెక్ట్ చేసిన తర్వాత మళ్లీ అర్హుల జాబితాలోకి తీసుకు రావడం కుదరదని పేర్కొంటున్నట్లు సమాచారం.

చినుకు పడితే చిత్తడే

ధారూరు: కురుస్తున్న వర్షాలకు మారుమూల గ్రామాల రహదారులు చిత్తడిగా మారాయి. సీసీ రోడ్లు లేకపోవడం, ప్రధాన రోడ్ల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు మట్టివే కావడంతో బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు రోడ్ల దుస్థితిపై దృష్టి సారించి, మరమ్మతులు, లేదా బీటీ, సీసీరోడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.


గట్టెపల్లితండా నుంచి గట్టెపల్లి గ్రామానికి వెళ్లే దారి దుస్థితి

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించండి


ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు కోళ్ల యాదయ్య కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీశైలంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కుల్కచర్ల మండల పరిధి పౌల్ట్రీ ఫాంలలో బాలలు పనిచేస్తున్నారని, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని పేర్కొన్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

తాండూరు రూరల్: అమ్మాయిలను వేధిస్తే చర్యలు తప్పవని కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తాండూర్ మండలం మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలు ఎలా జరుగుతాయోనని దృశ్య మాధ్యమం ద్వారా ఎస్‌ఐ వివరించారు.

నేడు పీఏసీఎస్ భవనం ప్రారంభం

కొందుర్గు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్, గిడ్డంగులను బుధవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పీఏసీఎస్ కార్యవర్గం, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గురుకులాలకు భవనాలు నిర్మించాలని వినతి

చేవెళ్ల: ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు నిర్మించేలా కృషి చేయాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. మంగళవారం నగరానికి వచ్చిన కేంద్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి రాందాస్ అథావాలేకు టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అన్ని గురుకులాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరామన్నారు.

పాత భవనాలతో ప్రమాదం

సోమవారం రాత్రి నుంచి జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడగా.. దినసరి కూలీలు ఇంటికే పరిమితం అయ్యారు. వృద్ధులు, పిల్లలు చలికి వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి వరకు పడిన వర్షాలతో వాగులు, కాలువలు వరదతో పరుగులు తీస్తున్నాయి. చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. పురాతన, శిథిలావస్థ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

- ఎడతెరపి లేని వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్


కొడంగల్: ప్రమాదకరంగా పాత భవంతి

కొడంగల్: పాత భవనాలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం కావడం వలన పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఇళ్లు, భవనాలు ఎప్పుడు కూలి, ఏం ప్రమాదం తెచ్చిపెడతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు పలు భవంతులు కూలిపోయాయి. ప్రాణ నష్టం జరగకపోయినప్పటికీ.. ఇళ్లు కూలి రోడ్లపై శిథిలాలు పడ్డాయి. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో.. పాత ఇళ్లలో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. పురాతన ఇళ్లను కూల్చివేయాలని ఆదేశాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతన్నలు హర్షం

పట్టణంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వానల కోసం ఎదురు చూసిన రైతన్నలు హర్షం వ్యక్తంచేశారు. వేసిన విత్తనాలు మొలకెత్తనున్నాయని చెప్పారు.

యాలాలలో..

యాలాల: మండలంలో సోమవారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురవగా.. కాల్వలు, కుంటలు, చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టులోకి వరద వచ్చింది. దీంతో మంగళవారం 25.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు మండల వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపారు.


యాలాల: బాగాయిపల్లి సమీప ప్రధాన రోడ్డు పక్కన పారుతున్న కాలువ

పొలాల్లో నిలిచిన నీరు

కొడంగల్ రూరల్: ఎడతెరపి లేని వర్షాలతో పొలాల్లో నీరు నిలిచిపోయింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు మండలంలో 11.6మిమీ వర్షపాతం నమోదయింది. పొలాల్లో కలుపు తీయలేక పోతున్నామని, పెద్ద వర్షాలు కాకపోయినప్పటికీ పనులు చేసుకునేందుకు వీలులేకుండా పోయిందని రైతులు పేర్కొంటున్నారు.


అనంతగిరి: వికారాబాద్‌లో..

ఈదురు గాలులు

పెద్దేముల్: ఏకదాటి వర్షంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దినసరి కూలీలు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. పెద్దేముల్ మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు సుమారు 20గంటలకు పైగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. వృద్ధులు, చిన్నారులు చలికి తాళలేక ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుత వర్షాలతో పనులకు ఆటంకం కలిగినా.. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలకు జీవం

మోమిన్‌పేట: సోమవారం రాత్రి నుంచి ఏకదాటిగా కురుస్తున్న వర్షాలు మొక్కలకు జీవం పోశాయి. విత్తులు విత్తిన నాటి నుంచి వరుణుడు దోబూచులాడడంతో కర్షకులు తొలుత కలవరపాటుకు గురైనప్పటికీ.. ప్రస్తుత వానలతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.


పెద్దేముల్: కురుస్తున్న వర్షం

అప్రమత్తతే రక్ష

వానాకాలం ప్రారంభమైంది. ఈ కాలంలో విష సర్పాల బెడద అధికంగా ఉంటుంది. ముఖ్యంగా రైతులు వాటి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. ప్రాణాల మీదకే వస్తుంది. దీనికి అప్రమత్తతే రక్ష.

- వర్షాకాలంలో పొంచిఉన్న ప్రమాదాలు
- విష సర్పాలు, కీటకాలతో జాగ్రత్త



నవాబుపేట: వర్షాకాలంలో పాములు అధికంగా సంచరిస్తుంటాయి. వర్షాలకు కందకాలు మూసుకుపోయి నివాసల్లోకి ప్రవేశిస్తుంటాయి. అలాగే పంట పొలాలు, చేలల్లో, పొదల్లో తిరుగుతుంటాయి. రోడ్ల పైకి వస్తుంటాయి. ఏటా ఈ సీజన్‌లో పాముకాటుకు గురై మనుషులతో పాటు మూగ జీవాలు మృత్యువాత పడుతుండగా.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్షణాల్లోనే..

కట్ల పాము కటేసిన క్షణాల్లో విషం రక్త కణాల్లో కలుస్తుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి. నాగు పాము కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం పారుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది. అలాగే జెర్రిపోతు, నీరు కట్ట కాటేసినా విషం ఉండదు. అయితే కాటేసిన చోట చికిత్స చేయించడానికి ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

మంత్రగాళ్లను ఆశ్రయించవద్దు

పాము కాటుకు వైద్యం ఉంది. విషంతో ఉన్న పాము కాటేసినప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నాటు వైద్యులను, మంత్రగాళ్లను ఆశ్రయించవద్దు. అలా చేస్తే తెలిసీ తెలియని పరిజ్ఞానంతో వైద్యం చేస్తే ప్రాణాలు పోవచ్చు. ఇదేమని అడిగితే.. మీరు ఆలస్యంగా తీసుకువచ్చారని తప్పించుకుంటారు. విషం లేని పాముకాటుకు గురై వారు ప్రాణాలతో బయటపడితే అది మంత్రగాళ్ల మహిమే అని నమ్ముతారు. ఇదే బాధితుల పాలిట ముప్పుగా మారుతోంది. సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే.. కాటేసిన పామును బట్టి చికిత్స చేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి

సాధ్యమైనంత వరకు పాములు, విష కీటకాల బారిన పడకుండా జాగ్రత్త పడాలి. రైతులు రాత్రి పూట పొలాల వద్దకు వెళితే.. చేతిలో కర్ర, టార్చిలైటు తీసుకెళ్లాలి. కప్పలు, ఎలుకలు ఉన్న చోట పాములు సంచరిస్తాయి. ఇంటి ఆవరణలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు, రంధ్రాల్లో నీరు నిండకుండా చూసుకోవాలి. ఇళ్లలో ఎలుకలు ఉంటే పాములు వస్తాయి. చిన్నారులను పొదలు, రాళ్లు, చెట్ల వైపుకు వెళ్లకుండా చూడాలి. పాము కాటు సాధారణంగా మోకాలు కింది భాగం వరకు ఉంటుంది. కావునా లుంగి, పంచె, పాయింటు కింది వరకు ఉండేలా చూసుకోవాలి.

ఆందోళన వద్దు

పాము కాటుకు గురైతే ఆందోళన చెందవద్దు. ఇది గుండె పోటుకు దారితీస్తుంది. ప్రాథమిక చర్యగా కాటు వేసిన ప్రదేశం పై భాగంలో కట్టు కట్టాలి. ఆ వెంటనే చికిత్స కోసం వెళ్లాలి. పాము కాటుకు గురైన వారు ఆసుపత్రికి వెళ్లి ఏ పాము కరిసిందో స్పష్టంగా చెప్పాలి. దాన్ని బట్టే చికిత్స చేస్తారు. ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంటాయి.

లక్షణాలు

విషపూరితమైన పాము కరిస్తే శరీరమంతా నీలం రంగులోకి మారుతుంది. రక్త పోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దుద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి నురగ వస్తుంది. ఆయాస పడతారు. శరీరమంతా చెమలు పట్టి కోమాలోకి వెళతారు. గుండె సాధారణ స్థాయికంటే రెట్టింపుగా కొట్టుకుంటుంది.

విష సర్పాలు రెండు రకాలు

న్యూరోటాక్సిన్ రకం నాగుపాము, కట్లపాము. రెండో రకం హిమోటాక్సిన్ అనగా రక్తపింజర. న్యూరోటాక్సిన్‌తో నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక ప్రాణాలు పోవచ్చు. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలలో కణజాలం నశించి, కాటు పడిన భాగంలో వాపు వస్తుంది. కాటేసింది ఏపామో తెలుసుకుంటే చికిత్స అందించడం సులువు. పక్క పక్కన రెండు దంతాల లాగా కాటు ఉంటే.. అది కచ్చితంగా విష సర్పం అనుకోవాలి. పాము కాటుతో ఉన్న భాగం నుంచి శరీరంలోకి రక్త ప్రసరణతో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

ఆలస్యం చేయొద్దు



పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందవద్దు. ఆసుపత్రిలో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనమ్ అనే సూదిమందు అందుబాటులో ఉంది. సర్పం కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా హాస్పిటల్‌లో చేర్పించాలి. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి.

–డా. రోహిత్, మండల వైద్యాధికారి, నవాబుపేట

నోట్ పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తాండూరు రూరల్: గోనూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమృతమ్మ, ఉపాధ్యాయులు కవిత, రవికుమార్, హరివిల్లు ప్రతినిధులు తమ్మప్ప, గౌరి శంకర్, గణేశ్, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కొందుర్గు: జీపీ కార్మికుల సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ కొందుర్గు మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ సమ్మెలో పాల్గొని కార్మికులకు మద్దతు పలికారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్మికులు నర్సమ్మ, వీరేశ్ శంకర్‌నాయక్, బసప్ప, రమేష్ పాల్గొన్నారు.

‘సంకల్ప రథయాత్ర’కు సిద్ధంకండి


రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాహెర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాత్రకు తమ సంఘాల పూర్తి మద్దతును అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ సంకల్పయాత్ర ఈ నెల 16వ తేదీన జోగులాంబ గద్వాల్ జిల్లాలో ప్రారంభమైందన్నారు. రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్, రాజేంద్రనగర్‌లోకి ఈ నెల 30వ తేదీన ప్రవేశించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ప్రధాన ఉపాధ్యాయులు నరహరి, జయసింహారెడ్డి, సుధాకర్, ఆశీర్వాదం, రాజేశ్వరి, శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.